సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 26 । మే । 2024



దోపిడీ కేసులో ఆరుగురు అరెస్టు

ధర్మలక్ష్మీపురంలో ఇటీవల జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.4.80 లక్షలు రికవరీ చేశారు.

- 8లో



31 నుంచి క్రికెట్ పోటీలు

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో ఈ నెల 31 నుంచి అండర్ -19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి.

- 8లో

వారంలోగా డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో అండర్ గ్రాడ్యుయేషన్ (డిగ్రీ) ఐదో సెమిస్టర్ ఫలితాలు వారం రోజుల్లో విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం చెప్పారు. జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయ్యిందని, కాన్ఫిడెన్సియర్ విభాగం పనులు పూర్తి చేసి ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మాక్ డ్రిల్

● నిరసనకారుల దాడులు.. నిలువరించిన పోలీసులు



గాల్లోకి కాల్పులు జరిపేందుకు సిద్ధమవుతున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్:

స్థలం: జిల్లా కేంద్రంలోని దేఅండ్ నైట్ కూడలి..
సమయం: శనివారం ఉదయం 11:14 గంటలు..
వంద మంది ఆందోళనకారుల గుంపు ఒక్కసారిగా దూసుకొచ్చింది..
ఓ చేతిలో ప్లకార్డులు.. మరో చేతిలో రాళ్లు..
పోలీసులు డౌన్ డౌన్.. అంటూ నినాదాలు..
కూడలి మధ్య మంట పెట్టిన టైర్లు..
ఎటు చూసినా భయానక వాతావరణం..



శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలిలో విధ్వంసం సృష్టిస్తున్న ఆందోళనకారులు

ఒక్కసారిగా జరిగిన ఈ అలజడికి నగరవాసులు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలికి చేరుకుని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు సరికదా.. ఆందోళనను మరింత తీవ్రతరం చేశారు. చేతికందినవన్నీ పోలీసులపై విసరడం మొదలుపెట్టారు. అంతే ఉన్నతాధికారులకు సీఐ సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఎస్పీ రాధిక ఆదేశాలతో డీఎస్పీ శేషాద్రినాయుడు ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ దళాలు రెండు వ్యాన్లతో అక్కడికి చేరాయి. మరో వైపు అగ్నిమాపక శకటం వెంటబెట్టుకుని జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు సిబ్బందితో పాటు చేరుకున్నారు. ఎస్పీ రాధిక ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం ఆందోళనల్ని ఎలా అదుపు చేయాలో ప్రణాళిక సిద్ధం చేశారు. పోలీస్ బృందాలు 'యాక్షన్' మొదలుపెట్టాయి. ఫైర్ ఇంజన్‌తో ఒక్కసారిగా నీటితో పాటు ఫోమ్‌ను ప్రయోగించారు. ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి లాఠీచార్జీ చేశాయి. పరిస్థితులు ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. మరోవైపు ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైర్ చేసి హెచ్చరించారు. ఆందోళనకారుల్ని చెదరగొడుతూ గాల్లోకి 'కాల్పులు' జరిపారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిరసన కారులు కుప్పకూలారు. అంబులెన్స్‌లు హడావిడి.. పోలీస్ సైరన్‌ల శబ్దాలతో ఆ ప్రాంతమంతా తీవ్ర గందరగోళం నెలకొంది. ఆందోళనకారుల్ని అదుపులోకి తీసుకుని పోలీసులు వారిని వాహనాల్లో తరలించారు.

ఈ దృశ్యాల్ని చూస్తూ భీతావహులైన ప్రజలకు మైక్‌లో ఒక ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. 'ఇది మాక్ డ్రిల్.. కౌంటింగ్ నేపథ్యంలో ఏమైనా హింసాత్మక ఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో వివరించడంలో భాగంగా పోలీసులు చేసిన సన్నాహక కార్యక్రమం' అని పోలీసులు ప్రకటించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంత వరకు 'నటించిన' పోలీసులు అక్కడ్నుంచి నిష్క్రమించారు.



రంగంలోకి దిగిన ఆర్మ్‌డ్ రిజర్వ్ దళాలు



నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య ఉద్రిక్త వాతావరణం



నేలకొరిగిన ఆందోళనకారులు



ఫోమ్‌ను ప్రయోగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లర్లకు దిగితే కఠిన చర్యలు

● ఎస్పీ రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అల్లర్లు, ఆందోళనలు, విధ్వంసాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ జి.ఆర్.రాధిక హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ కూడలి సమీపంలో నిర్వహించిన మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ కార్యక్రమంలో భాగంగా విలేకరులతో మాట్లాడారు. తుది ఫలితాలు వచ్చేంత వరకు జిల్లాలో ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులకు సన్నాహకంగా.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇదే విధంగా జిల్లావ్యాప్తంగా ముఖ్య కేంద్రాల్లో జూన్ 4 వరకు పోలీసులతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సంఘ విద్రోహక శక్తులు, అల్లరి మూకలను నియంత్రిస్తామన్నారు. ఇప్పటికే శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్ విక్రయాలకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయాలు, విజయోత్సవ ర్యాలీల నిర్వహణకు సైతం అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తప్పిన ముప్పు



కవిటిలో కారుపై కూలిన చెట్టు

కవిటి: మండలంలోని కవిటి అశోక్ థియేటర్ సమీపంలో నెలవంక గ్రామం నుంచి కవిటి వెళుతున్న ఓ కారుపై శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో అకస్మాత్తుగా ఓ మోడు వారిన చెట్టు విరిగిపడింది. కారు దెబ్బతిన్నా లోపల ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెట్టు మోడుబారి ఉండటం, ఓ మోస్తరు వర్షపు జల్లులకు నేలతడిచి ఉండటంతో ఒక్కసారిగా నేలకొరిగిందని స్థానికులు చెబుతున్నారు.

సజావుగా ఉప విద్యాశాఖాధికారి పరీక్షలు



నరసన్నపేటలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్/నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన డిప్యూటీ ఈవో (ఉపవిద్యా శాఖాధికారి) ప్రవేశ పరీక్ష జిల్లాలోని నాలుగు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 100 మందికి 68 మంది, ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో 100 మందికి 72 మంది, టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కాలేజ్‌లో 300 మందికి 178 మంది, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ కేంద్రంలో 330 మందికి 233 మంది హాజరయ్యారు. మొత్తం 279 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేటలో తహసీల్దార్ కనకారావు పర్యవేక్షించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 33 మంది ఎంపిక



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం క్యాంపస్ డ్రైవ్ జరిగింది. ముందుగా జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 33 మంది ఎంపికయ్యారు. కంప్యూటర్స్ బ్రాంచ్ నుంచి 23 మంది, ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్ నుంచి 10 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి రూ.8 లక్షలు నుంచి రూ.2.6 లక్షలు ప్యాకేజీ లభిస్తుందని ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు తెలిపారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ పీవీఆర్ రఘునాథ్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక నిఘా

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలబాలికల సంరక్షణకు ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. శనివారం ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా జిల్లా న్యాయ సదన్‌లో ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోతున్న బాలబాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి పిల్లల కదలికలపై ఆరా తీసి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో తేడా గుర్తిస్తే వెంటనే వారిని సన్మార్గంలో పెట్టాలన్నారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాల వల్ల కలిగే అనర్థాలను పిల్లలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) ఆర్.సన్యాసినాయుడు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ బగాది శాంతిశ్రీ, బాలల సంరక్షణాధికారి కె.వి.రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీవిద్య, ఎన్జీవో ప్రతినిధి ప్రసాద్, పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రగ్బీ జట్ల ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రగ్బీ జిల్లా జట్లు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–18 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ ఎంపికల్లో ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున 24 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 31 నుంచి విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో వీరంతా పాల్గొంటారు. అసోసియేషన్ అధ్యక్షుడు డొంకాన రామకృష్ణ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.పార్వతీశం, ఆర్గనైజర్ బి.నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, కె.రఘునాథరావు, శైలజ, అనిల్, సీతయ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ కళలో చరిష్మా

● మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న చిన్నారి నేతింటి చరిష్మా
● జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట

టాలెంట్



పతకాలతో చిన్నారి చరిష్మా

ఎచ్చెర్ల క్యాంపస్ : ఆ చిన్నారి వయసు పదేళ్లే.. అయితేనేం యుద్ధకళ పోటీలో దిగిందంటే పతకం రావాల్సిందే. పోటీ ఏదైనా పతకం ఖాయం చేసుకుంటూ జాతీయ స్థాయిలో రాణిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. ఎచ్చెర్ల గ్రామానికి చెందిన నేతింటి చరిష్మా శ్రీకాకుళం పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో ఐదో తరగతి చదువుతోంది. మూడో తరగతి నుంచే మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేస్తుంది. కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు వద్ద మెలకువలు నేర్చుకుంటూ పోటీల్లో రాణిస్తోంది. కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు రాజారావు, రాజేశ్వరి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నారు.

పతకాల పంట..

- చరిష్మా సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్ యుద్ధకళలో ప్రత్యేకంగా రాణిస్తోంది.
- 2023లో శ్రీకాకుళం పట్టణంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో జరిగిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అండర్–9 విభాగంలో కాంస్య పతకం సాధించింది.
- విశాఖలో జరిగిన ఇండో–నేపాల్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో వెపన్ ఈవెంట్ స్టిక్ విభాగంలో కాంస్య పతకం సాధించింది.
- త్రివేండ్రంలో జరిగిన సౌత్ ఇండియా పెన్‌కాక్ సిలట్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో టాండింగ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది.
- మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ విభాగంలో టాండింగ్ ఈవెంట్‌లో (ఫైట్) కాంస్య పతకం సాధించింది.
- శ్రీకాకుళం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మే 5న జరిగిన 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో సోలో ఈవెంట్‌లో గోల్డ్ మెడల్, టాండింగ్ ఈవెంట్‌లో సిల్వర్ పతకం సాధించింది.
- పాండిచ్చేరిలో జూలై 6, 7 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో సౌత్ ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించనుంది.



స్టిక్‌తో చిన్నారి

మెరుగైన ప్రదర్శన..



యుద్ధకళ సాధనలో చిన్నారి చరిష్మా ప్రత్యేకత చాటుకుంటోంది. మిగతా పిల్లలతో పోల్చితే కర్ర తిప్పటంలో మెరుగైన ప్రదర్శన ఇస్తోంది. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణించే అవకాశం ఉంది.

– నక్క లక్ష్మణ్‌నాయుడు, కోచ్

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి



సాయిప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలనా విభాగ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ భూములు, ఆదాయ వివరాలను ఈవో వివరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ రాణి పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



కాలిపోతున్న కొబ్బరి చెట్టు

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఆఫీసియల్ కాలనీలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది. భారీగా ఉరుములు రావడంతో ప్రజలు భయాందోళన చెందారు.

తొలకరి జల్లులతో అన్నదాతల్లో ఆనందం



లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు

కవిటి: గడిచిన రెండు రోజులుగా కవిటి మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరుగా కురిసిన వర్షాలకు అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో శనివారం కురిసిన వర్షంతో కొబ్బరి రైతులు ఊపిరిపీల్చుకున్నారు. జూన్ రెండో వారంలో వరినారుమడులు సిద్ధంచేసుకునేందుకు, వేసవి దుక్కులకు సైతం ఈ వర్షం అనుకూలిస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. తాజా వర్షం వల్ల లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి నీరు చేరింది.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు



ఎం.రాధాకృష్ణ ప్రిన్సిపాల్

పాతపట్నం: పాతపట్నం ఐటీడీఏలో నిర్వహిస్తున్న మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2024–25 సంవత్సరానికి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని వెరిఫికేషన్‌కు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ శనివారం తెలిపారు. ఇటీవల ఏకలవ్య స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని చెప్పారు. ఎంపికైన వారు జూన్ 6 నుంచి 15 మధ్య ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్సులతో పాఠశాలకు రావాలన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపర్చిన చిలకపాలెం శివానీ కాలేజీలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను శనివారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది రిజిస్టర్, మూడంచెల భద్రతపై ఆరా తీశారు. కౌంటింగ్ నాడు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



● విన్యాసం



కవిటి మండలం నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, వీధినాటకాలు ఆద్యంతం అలరించాయి. కాళికామాత వేషధారణలతో కొందరు నిప్పుతో చేసిన విన్యాసాలు గగుర్పాటును కలిగించాయి. -కవిటి

● వినీలాకాశం



కోటబొమ్మాళి ప్రాంతంలో శనివారం వేకువజామున 5.30 సమయంలో ఆకాశంలో దృశ్యాలు అబ్బురపరిచాయి. మేఘాలు ఎరుపు, నీలం తదితర రంగులు మార్చుతూ అద్భుత దృశ్యాలను ఆవిష్కరించాయి. అటువైపుగా వెళ్లిన వాకర్లు రంగుల మేఘాలను ఆసక్తిగా తిలకించారు. - కోటబొమ్మాళి

● వింతైన కీటకం



చూస్తే అచ్చం ఎండిన ఆకులాగే కనిపిస్తుంది. పరిసరాల్లో కలిసిపోతూ చిన్నచిన్న కీటకాలు తింటూ జీవనం సాగించే వీటిని స్థానికంగా గొల్లభామలుగా పిలుస్తుంటారు. ఈ రకమైన కీటకాలు ప్రపంచ వ్యాప్తంగా 2400 రకాలు ఉన్నాయని పలాస పశువైద్య సహాయ సంచాలకుడు చంద్రశేఖరరావు తెలిపారు. పలాస మండలం లొత్తూరు సమీపంలో వరహాలమ్మ రిజర్వాయర్ వద్ద ఈ కీటకం కనిపించింది. - కాశీబుగ్గ

దోపిడీ కేసులో ఆరుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలచంద్రరెడ్డి

- రూ.4.80 లక్షలు రికవరీ
- ధర్మలక్ష్మీపురం కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నరసన్నపేట: సారవకోట మండలం ధర్మలక్ష్మీపురంలో ఇటీవల జరిగిన రూ.10 లక్షల దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ప్రమేయమున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.4.80 లక్షలు రికవరీ చేశారు. ఈ నెల 18న ఈ ఘటన జరగ్గా, అదే రోజు సాయంత్రం బాధితుడు సారవకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు వివరాలు సేకరించిన ఎస్‌ఐ అప్పారావు సిబ్బందిని వెంటనే అలెర్ట్ చేశారు. నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి వారం రోజుల్లోనే కేసు కొలిక్కి తీసుకువచ్చారు. ఈ మేరకు టెక్కలి డీఎస్పీ బాలచంద్రరెడ్డి శనివారం నరసన్నపేట సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

పక్కా పథకం ప్రకారం..

అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన కాంట్రాక్టర్ నక్కల్ల మణికంఠ శ్రీ కన్‌స్ట్రక్షన్‌లో ఓ బిల్డర్. ఈయన వద్ద యువరాజు అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. గత పరిచయం మేరకు ధర్మలక్ష్మీపురం వద్ద ఒక స్థలం అమ్మకానికి ఉందని, స్థలం చూసే ముందు కొంత మొత్తం టోకెన్ అడ్వాన్స్‌గా ఇవ్వాలని యువరాజు మణికంఠకు చెప్పాడు. దీంతో మణికంఠ రూ.10 లక్షలు పట్టుకొని ఈ నెల 18న ఆ స్థలం వద్దకు కారులో వచ్చాడు. అదే సమయంలో షడన్‌గా మరో కారులో నలుగురు వ్యక్తులు వచ్చి తాము పోలీసులమని చెప్పి ఆ డబ్బును దౌర్జన్యంగా తీసుకెళ్లిపోయారు. వెంటనే మణికంఠ ఆ కారును వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం 12 మంది భాగస్వామ్యం ఉన్నట్లు దర్యాప్తులో తేలగా వీరిలో ఆరుగురు (నిమ్మల మనోజ్‌కుమార్, బిడ్డక యువరాజు, సోలిమాన్ కరోడా, పసుపు రెడ్డి తవుడు, అగ్గల రాజేష్, జీబంట లీమా)ను భామిని మండలంలోనూ, పర్లాకిమిడి వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద రూ.4.80 లక్షలు రికవరీ చేశారు. కారు, ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. మిగిలిన ఆరుగురు కోసం గాలిస్తున్నామని, మరో రూ.5.20 లక్షలను రికవరీ చేయాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. ఎస్‌ఐ అప్పారావు, కానిస్టేబుల్స్ దాలినాయుడు, జోగారావు, గోపాలరావు, జి.సత్యనారాయణలు చురుగ్గా స్పందించి కేసును ఛేదించినందుకు రివార్డు కోసం ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు.

తిలక్‌కు గృహ నిర్బంధం

నందిగాం: ఇటీవల తెలుగుదేశం మూకల దాడిలో గాయపడి మృతి చెందిన కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురం గ్రామానికి చెందిన తోట మల్లేష్ కుటుంబసభ్యులను పరామర్శించేందుకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను స్వగ్రామం కణితూరులో పోలీసులు శనివారం మరోసారి గృహ నిర్బంధం చేశారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ అధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిలక్ ఇంటి వద్దకు చేరుకొని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడకు చేరుకొని టీడీపీ నేతలు కింజరాపు అచ్చెన్నాయుడు, హరిప్రసాద్, రామ్మోహననాయుడు ప్రోత్సాహంతో ఆ పార్టీ మూకలు దాడులకు పాల్పడి, మృతి చెందేలా చేశారని ఆరోపించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని వారు నిలదీశారు.



కణితూరులో పేరాడ తిలక్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

ఏయూ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో మొత్తం 27,603 మంది పరీక్షకు హాజరవగా 27,483 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 99.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీఏ(సీబీసీఎస్)లో 99.68, బీబీఏ(సీబీసీఎస్)లో 98.66, బీకాం(కంప్యూటర్స్)లో 99.71, బీకాం(జనరల్)లో 99.92, బీహెచ్ఎంసీటీలో 100, బీఎస్సీలో 99.52, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీలో 90, బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో 100, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీలో 100, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషన్‌లో 100 మంది ఉత్తీర్ణత సాధించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

31 నుంచి అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

టెక్కలి: జిల్లా క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో ఈ నెల 31 నుంచి అండర్ –19 విభాగంలో అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. సుమారు దశాబ్ద కాలం తరువాత జిల్లాలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సెక్రటరీ హసన్ రాజా షేక్, కోశాధికారి కేఎస్ఎం శైలానీ, మెంటార్ ఇలియాస్ అహ్మద్, సెలక్టర్ ఆర్‌సీ.రెడ్డి, టోర్నమెంట్ కన్వీనర్ లాల్ తదితరులు శనివారం క్రికెట్ మైదానాన్ని పరిశీలించారు. జూన్ 15 నుంచి ఇదే కళాశాల మైదానంలో అండర్–23 క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు కూడా అసోషియేషన్ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు.

అండర్–19 జట్టు ఇవే..

ఈ నెల 31 నుంచి జరగనున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో భాగంగా మొదటి రోజు శ్రీకాకుళం – తూర్పుగోదావరి, జూన్ 1న విజయనగరం–తూర్పుగోదావరి, 2న విశాఖ–తూర్పుగోదావరి, 3న విజయనగరం–విశాఖ, 4న శ్రీకాకుళం– విశాఖ, 5న విజయనగరం–శ్రీకాకుళం జట్లు తలపడనున్నాయి. అండర్–19 జిల్లా జట్టుకు వి.ప్రదీప్‌సాయి(కెప్టెన్), సుశాంత్, సిద్ధు విఘ్నేష్, జయరాం, గోపాలకృష్ణ, ఎస్.రాజ్‌కుమార్, సాయి సుజన్, పూర్ణ చంద్ర, జున్నారావు, ఎం.రోహిత్, థామస్ రామ్‌కుమార్, నవీన్‌కుమార్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్, వినీల్ సాగర్, అభయ్, సిద్ధ, స్టాండ్ బై క్రీడాకారులుగా వి.కృష్ణ, వి.మోహన్‌రావు, అభినయ్, వి.వినయ్‌చంద్ర, పూజారి దినేష్, భరత్‌కుమార్ తదితరులను ఎంపిక చేశారు. ఆగస్టులో జరగనున్న డేస్ మ్యాచ్‌లకు ఎన్.సుశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం జరగనున్న మ్యాచ్‌లకు కోచ్, మేనేజర్‌గా మేఘనాథ్, నార్త్ జోన్ సెలక్టర్‌గా బొడ్డేపల్లి వర్ధన్ వ్యవహరిస్తారు.



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో క్రికెట్ మైదానాన్ని పరిశీలిస్తున్న జిల్లా క్రికెట్ అసోషియేషన్ ప్రతినిధులు

పారా బీచ్ వాలీబాల్ పోటీలకు కొవ్వాడ క్రీడాకారుడు



వెంకటరమణ

రణస్థలం: ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ పోటీలకు దేశం తరఫున కొవ్వాడ గ్రామానికి చెందిన క్రీడాకారుడు మైలపల్లి వెంకటరమణ ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి జూన్ 5వ వరకు చైనాలో జరిగే ఈ పోటీలకు వెంకటరమణకు పార్లెమిపిక్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరఫున ఆహ్వానం అందిందని గ్రామస్తులు శనివారం చెప్పారు. విమాన చార్జీలతో పాటు ఇతర అలవెన్సులకు రూ.2.25లక్షలను ప్రభుత్వమే చెల్లించింది. వెంకటరమణ ప్రస్తుతం బెంగళూరులోని క్రీడా అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. అక్కడి నుంచి రెండు రోజుల్లో చైనాకు బయలుదేరుతాడు. తండ్రి మైలపల్లి కృష్ణ చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తున్నారు.

సివిల్స్ అభ్యర్థులకు అండగా

సుశీలమ్మ ఫౌండేషన్

రాజాం సిటీ: సివిల్స్ చదవాలన్న ఆసక్తి ఉండి సరైన అవకాశాల్లేని విద్యార్థులకు లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ప్రేరణ కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి వారి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తూ విద్యార్థులకు చేదోడుగా నిలుస్తోంది. గతేడాది ఇదే తరహాలో 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఢిల్లీలో సివిల్స్‌లో శిక్షణ ఇప్పించింది. ఈ ఏడాది కూడా 2022, 23, 24 సంవత్సరాలలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. జూన్ 30న రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కోచింగ్, వసతి కోసం ఒక్కొక్కరికి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీ:// ఏపీఎస్ఎస్ఏ. ఏపీటీఓఎన్ఎల్ఐఎన్ఈ.ఐఎన్/ పీఆర్ఈఆర్ఏఎన్ఏ/ ఐఎన్‌డీఈఎక్స్. పీహెచ్‌పీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష ఫీజు కింద వంద రూపాయలు చెల్లించాలి. అయితే పరీక్షకు హాజరైన వారికి ఆ నగదు తిరిగి ఇచ్చేస్తారు. పరీక్షను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వారిచే నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 80744 02554 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రేరణ పాంప్లెట్

అమరవీరులకు నివాళులు

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడులో అమరవీరులు చారు మజుందార్ విగ్రహాల వద్ద శనివారం ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1967లో పశ్చిమబెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా సిలిగురి సబ్ డివిజన్ నక్సల్బరీ బ్లాక్‌లో జరిగిన సాయుధ తిరుగుబాటులో కమ్యూనిస్టు నాయకులు నాయకత్వం వహించారని, అప్పటి నుంచి దేశంలో ప్రకంపనలు ప్రారంభమయ్యాయని అన్నారు. అటువంటి అమరులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల కైలాష్, దుష్యంత్, రామారావు, అప్పారావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు కుసుమ, బాలకృష్ణ, రాపాక మాధవరావు, గోపి రామకృష్ణ, ఉమాపతి పాల్గొన్నారు.



బొడ్డపాడులో నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం హెటిరో ఫార్మా కంపెనీ, హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 310 మంది బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు హాజరు కాగా, ప్రతిభ కనబరిచిన 100 మందికి ఎంపిక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, కొత్తకోట రవీంద్ర, రామకృష్ణ, హెటిరో ఫార్మా కంపెనీ హెచ్ఆర్ ఎస్.నరేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెటెరో కంపెనీ హెచ్ఆర్ నరేష్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం జగనన్న కాలనీ వద్ద అంపురం –మాణిక్యపురం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన కె.ఢిల్లీశ్వరరావు, టి.శ్రీసాయిలు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న ఢిల్లీశ్వరరావుకు తీవ్రగాయాలవ్వగా, శ్రీసాయికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు తులాల ఆభరణాలు చోరీ

బూర్జ: మండలంలోని సింగన్నపాలెంలో వరలక్ష్మికి చెందిన మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వరలక్ష్మి భర్త తులగాపు బాబూరావు పాలకొండ ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు విధుల్లో భాగంగా పాలకొండ వెళ్లిపోయారు. అనంతరం వరలక్ష్మి నిద్రపోయింది. ఈ సమయంలో గజాల తలుపులకు గడియ పెట్టడం మర్చిపోయింది. ఇదే అదునుగా అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి వరలక్ష్మి ధరించిన రెండు తులాల చైన్, తులం శతమానం తెంచుకుపోయారు. కొద్దిసేపటి తర్వాత మెలకువ రావడంతో చోరీ జరిగినట్లు గుర్తించి కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చినా అప్పటికే దొంగలు పారిపోయారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్సై జి.వి.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మండలంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పోలాకి: మండలంలోని పల్లిపేట వద్ద వంశధార నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలాకి పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. వివరాలు తెలిసిన వారు పోలాకి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సత్యనారాయణ కోరారు.



వ్యక్తి మృతదేహం

వడదెబ్బతో ఉపాధి వేతనదారుడు మృతి

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి పని చేస్తూ వడదెబ్బకు గురై వేతనదారుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు పంచాయతీ చిన్నలక్ష్మీపురం పెద్దగాయి నుంచి కీలువారిపుట్ట వరదగట్టుపై శనివారం ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దున్న దుర్యోధన(57) అస్వస్థతకు గురయ్యాడు. పని ప్రదేశంలోనే కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు సపర్యలు చేసినప్పటికీ మృతి చెందాడు. ఫీల్డ్ అసిస్టెంట్ యర్ర జోగారావు ద్వారా విషయం తెలుసుకున్న ఏపీఓ పెట్ల శ్రీనివాసరావు, వీఆర్వో ఢిల్లీరావులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని డ్వామా పీడీ దృష్టికి తీసుకువెళ్లి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడికి భార్య దాలమ్మ, పెళ్లైన ముగ్గురు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన దుర్యోధన